సైన్స్‌పై అవగాహన ఉండాలి

బీర్కూర్‌లోని పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ టౌన్, జనవరి 3 : విద్యార్థులు సైన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బాన్సువాడ కొయ్యగుట్ట గురుకుల బాలికల పాఠశాలలో రాష్ట్ర స్థాయి జీవశాస్త్ర ప్రతిభా పరీక్షను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను వీడాలని, సైన్స్‌తోనే మానవ మనుగడని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి జీవశాస్త్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శించిన సబ్ కలెక్టర్

నస్రుల్లాబాద్, జనవరి 3 : బీర్కూర్‌లోని బీసీ గురుకుల బాలుర పాఠశాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ లత, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘననివాళి

బాన్సువాడలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఉమ్మడి నిజాంసాగర్ మండలంలోని మహిళా టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 3 : జిల్లా వ్యాప్తంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలు, కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. సావిత్రీ బాయి పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, టీచర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో.. ఎంఈవో, ఉపాధ్యాయులు

మల్లాయిపల్లిలో సావిత్రీబాయి పూలే వేషధారణలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని

విత్తన షాపు తనిఖీ

భిక్కనూరులో శాంపిల్ సేకరిస్తున్న ఏడీఏ అపర్ణ

భిక్కనూరు, జనవరి 3 : మండలంలోని తిప్పాపూర్‌లో వరి, మక్కజొన్న పంటలను ఏడీఏ అపర్ణ శుక్రవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం భిక్కనూరులోని విత్తన షాపులను తనిఖీ చేసి, మక్కజొన్న శాంపిళ్లను సేకరించారు. మండల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో పవన్‌కుమార్, ఏఈవో వినోద్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

మాచారెడ్డి, జనవరి 3 : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోదూరి బాలయ్య(66) ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లాడని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని, శుక్రవారం బండారి చెరువులో మృతదేహం లభించినట్లు తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కొడుకు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సీఎంఆర్ సరఫరాను వేగవంతం చేయాలి

మాచారెడ్డి, జనవరి 3 : సీఎంఆర్ సరఫరాను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పాల్వంచ మండలంలోని భవానీపేట గ్రామంలో ఉన్న ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం సరఫరా చేయాల్సిన బియ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లును శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, మల్లికార్జున్, తహసీల్దార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

కామారెడ్డి, జనవరి 3 : అదనపు కట్నం కోసం భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు, రూ.మూడు వేల జరిమానా విధించినట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 28వ తేదీ 2021లో రాఘవపల్లి తండాకు చెందిన విజయ(28)కు సురాయిపల్లి తండాకు చెందిన రామావత్ రమేశ్‌తో వివాహమైంది. తర్వాత తన భార్యను డబ్బులు తీసుకురమ్మని పలుమార్లు వేధించాడు. వేధింపులు భరించలేక తల్లిగారి ఇంటికి వెళ్లగా ఫిబ్రవరి 27వ తేదీ 2021న రోజున లింగంపేటలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి తిరిగి అత్తగారి ఇంటికి పంపించారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు నిందితుడు రమేశ్ తన భార్య విజయను లింగంపేట బస్టాండ్ సీసీ రోడ్డు వద్ద తీసుకెళ్లి గొడవ పెట్టుకొని తలను సీసీ రోడ్డు కేసి కొట్టగా ఆమెకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చూసి చికిత్స కోసం లింగంపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా సీరియస్‌గా ఉన్నదని చెప్పడంతో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఫిబ్రవరి 28వ తేదీ 2021 ఉదయం విజయ మృతిచెందింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి రమేశ్ నేరస్తుడని గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసులో సాక్షులు, సాక్షాధారాలను పరిశీలించగా కేసు రుజువైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్.వీఆర్‌ఆర్.వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.మూడు వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసు సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి ఎల్లారెడ్డి సీఐ రాజశేఖర్, ఎస్సై శ్రీకాంత్, ప్రస్తుత పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్, ప్రస్తుత ఎస్సై సుధాకర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై మురళి, కోర్టు కానిస్టేబుల్ సాయిలును ఎస్పీ అభినందించారు.

నేడు మెగా జాబ్ మేళా

కామారెడ్డి, జనవరి 3 : జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో టాస్క్ వారి ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ల్యాబోరేటర్ వారు శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా మారిన రోడ్డు
- వాహనదారులకు ఇబ్బందులు

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన గుంత

మాచారెడ్డి, జనవరి 3 : మాచారెడ్డి నుంచి ఘన్‌పూర్ స్టేజీ వరకు ఉన్న రెండు వరుసల రహదారిని గత ప్రభుత్వ హయాంలో నాలుగు వరుసల రహదారిగా మార్చడంతోపాటు డివైడర్‌ను నిర్మించారు. మాచారెడ్డి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఎదురుగా మాచారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్లే రహదారిలో రోడ్డు కింద ఉన్న మిషన్ భగీరథ పైపులు పగిలి పోవడంతో రోడ్డు పూర్తిగా కుంగి ప్రమాదకరంగా మారింది. 15 రోజుల క్రితం ఇదేవిధంగా జరిగితే మిషన్ భగీరథ అధికారులు నాసిరకంగా పనులు చేపట్టి వదిలేశారు. మళ్లీ శుక్రవారం మిషన్ భగీరథ పైపులు పగిలిపోయి రోడ్డు కిందనుంచి నీళ్లు పైకి రావడంతో రోడ్డు మళ్లీ కుంగిపోయింది. రాత్రి పూట వెళ్లే వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టి, ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

జిల్లాలో 91,935 ఎకరాల్లో సోయా సాగు

కామారెడ్డి, జనవరి 3 : జిల్లాలో 91,935 ఎకరాల్లో సోయాబీన్ పంటను రైతులు సాగుచేస్తున్నారని తెలంగాణ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాఫెడ్ తరపున రైతులకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,892 అందజేసేందుకు తొమ్మిది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీ వరకు 8,071 మంది రైతుల నుంచి 1,37,871 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 7వ తేదీ వరకు మాత్రమే సోయాను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

గురుకులాలను మెరుగుపర్చాలి

ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి, జనవరి 3 : గురుకుల సామాజిక సంక్షేమ వసతి గృహాలు, విద్యా రంగాన్ని మెరుగుపర్చాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవో సయ్యద్ మన్సూర్ రహమత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు ప్రత్యూషారెడ్డి, టౌన్ సెక్రటరీ సంతోష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సమీర్, మానస, మహిళా ఇన్‌చార్జి సంజన, నవ్యశ్రీ, సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేయించిన అధికారులు

బీబీపేట్, జనవరి 3 : మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శుక్రవారం 'పారిశుద్ధ్య అస్తవ్యస్తం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్ యాదవ్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ స్పందించి, పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని మురికి కాల్వల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, మినీ వాటర్ ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన నాచు, పిచ్చి మొక్కలను తొలగింపజేయించారు. గ్రామాభివృద్ధిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, గ్రామంలోని పలు వార్డులను పరిశీలించారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తుజాల్‌పూర్‌లో పారిశుద్ధ్య పనులను చేయిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్ యాదవ్

చెట్ల కొమ్మలను తొలగించిన విద్యుత్ సిబ్బంది

బీబీపేట్(దోమకొండ), జనవరి 3 : దోమకొండలోని శివరాం మందిర్ రోడ్డులో కరెంట్ వైర్లకు తాకుతున్న చెట్టు కొమ్మలను అధికారులు సరికేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చెట్ల కొమ్మలు తొలగించండి' అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కామారెడ్డి డివిజినల్ ఇంజినీర్(డీఈ) బీఎన్‌కే. చక్రవర్తి స్పందించి దోమకొండ ఏఈ కేవీ.రమణారెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో విద్యుత్ వైర్లకు తాకుతున్న కొమ్మలను తొలగించినట్లు తెలిపారు. సోమవారంలోగా మిగిలిన చెట్ల కొమ్మలను తొలగిస్తామని ఏఈ కేవీ. రమణారెడ్డి తెలిపారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లోర్ మిల్‌ను పరిశీలించిన డీఆర్డీవో

కోర్పోల్‌లో ప్యాకింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో

లింగంపేట, జనవరి 3: లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి డీఆర్డీవో సురేందర్ పర్యటించారు. మండలంలోని కోర్పోల్ గ్రామంలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలో భాగంగా రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన ఫ్లోర్ మిల్‌ను సందర్శించారు. అక్కడ తయారు చేస్తున్న పిండి, ప్యాకింగ్ తదితర వాటిని ఆయన పరిశీలించి, మార్కెటింగ్, ఆదాయ వ్యయాలను యజమాని మ్యాడం శోభరాణిని అడిగి తెలుసుకున్నారు. పిండి ప్యాకింగ్ కోసం అధునాతన యంత్రం ఏర్పాటుకు రుణ సహాయం అందించాలని ఆమె అధికారులను కోరారు. అనంతరం లింగంపేటలోని డంపింగ్ యార్డు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి నాగన్న బావి పరిసరాలను పరిశీలించారు. నాగన్న బావి వద్ద పర్యాటకుల కోసం తాగునీటి సౌకర్యంతోపాటు స్నాక్స్ విక్రయాల కోసం క్యాంటిన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అక్కడ మరుగుదొడ్ల నిర్మించనున్నట్లు తెలిపారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్లారీ, ఏపీఎం చామంతి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌తోపాటు సెర్ప్ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

లింగంపేట, జనవరి 3: లింగంపేట మండలంలోని ముంబాజీపేట తండా అంగన్‌వాడీ కేంద్రానికి తండాకు చెందిన యువకులు కుర్చీలు బహూకరించారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా కుర్చీలను వితరణ చేశామన్నారు. ఈ సందర్భంగా యువకులకు అంగన్‌వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బానోత్ సురేశ్ నాయక్, బన్సీలాల్, గణేశ్, వేణుసింగ్, సురేందర్, పురుషోత్తంతోపాటు అంగన్‌వాడీ టీచర్ ఆనూషా, ఆయా శాంతాబాయి, ఆశ కార్యకర్త సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలి

నాగిరెడ్డిపేట, జనవరి 3: మండలంలోని బెజ్‌గాం చెరువు తండాకు మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ప్రారంభించాలని కోరుతూ తండావాసులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బెజ్‌గాం చెరువు, ఎర్రకుంట తండాలను కలిపి నూతన జీపీగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీపీ భవన నిర్మాణం కోసం మూడేండ్ల క్రితం ఒకరు ఉచితంగా భూమిని ఇచ్చారని చెప్పారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభించాలని తండావాసులు ఎంపీడీవోను కోరారు.

నేడు పోచారం ప్రాజెక్టు నీటి విడుదల

నాగిరెడ్డిపేట, జనవరి 3: పోచారం ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల సాగు కోసం కలెక్టర్ అశీష్ సంగ్వాన్ శనివారం నీటిని విడుదల చేస్తారని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని ఏ జోన్ పంటల సాగు కోసం నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సెల్‌ఫోన్ల అందజేత

రామారెడ్డి, జనవరి 3: రెడ్డిపేట గ్రామానికి చెందిన రమేశ్ నెల రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేశారు. దానిని బాధితుడికి శుక్రవారం ఎస్సై నరేశ్ అందజేశారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి, జనవరి 3 : పాల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన జంగంపల్లి శివరాజ్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి శుక్రవారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

హాస్టళ్ల బాట పట్టిన అధికారులు

మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రీజినల్ కో-ఆర్డినేటర్ కిరణ్‌గౌడ్

విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్పీవో నాగరాజు

ప్రభుత్వ అధికారులు శుక్రవారం హాస్టళ్లు, విద్యాసంస్థల బాట పట్టారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు.

ఎల్లారెడ్డి రూరల్/ మద్నూర్/ లింగంపేట, జనవరి 3: వసతి గృహ బాలికలు శ్రద్ధగా చదువుకునే విధంగా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. ఎల్లారెడ్డి ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వసతిగృహంలోని రికార్డులు, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. వంటగదితోపాటు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ మెట్రిన్ శారద, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయని అని అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలను ఎంపీడీవో ప్రకాశ్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి.. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఆయనతోపాటు ప్రిన్సిపాల్ రఫత్, ఎల్ఎల్‌సీ బాల్‌రాజు, ప్రవీణ్‌కుమార్, మంజూర్, ఖాజా, సంతోష్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లోని కస్తూర్బా, ఎస్సీ బాలికల వసతి గృహాన్ని డీఎల్పీవో నాగరాజు పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనంతోపాటు పరిసరాలను పరిశీలించి వారితో మాట్లాడారు. విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాణి ఉన్నారు.

విద్యార్థులకు నిత్యం పౌష్టికాహారాన్ని అందించాలని లింగంపేట ఎంఈవో షౌకత్ అలీ సూచించారు. మండల కేంద్రంలోని కసూర్బా బాలికల గురుకుల పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రెండు వసతి గృహాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టికలను తనిఖీ చేశారు. కస్తూర్బా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నిరవధిక సమ్మెలో ఉన్నందున నలుగురు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. రాత్రి పూట మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ ఉన్న కూరగాయలను పరిశీలించారు. ప్రభుత్వం అందించిన రగ్గులు, స్వెట్టర్లు, టోపీలతోపాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు పంపిణీ చేశారు. ఆయన వెంట కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది, ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రీజినల్ కో-ఆర్డినేటర్ కిరణ్‌గౌడ్ సూచించారు. లింగంపేటలోని మైనార్టీ గురుకుల కాలేజీని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాలేజీలో కామన్ డైట్ ప్రోగ్రాం అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు. మహిళా అధ్యాపకురాలు అంజుమ్ ఫాతీమాకు శాలువా కప్పి సన్మానించారు. ఆయనవెంట తహసీల్దార్ రాజా నరేందర్‌గౌడ్, కాలేజీ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రతిభా పరీక్షలతో పోటీతత్వం పెరుగుతుంది

ప్రశ్న పత్రాన్ని విడుదల చేస్తున్న ఎంఈవో

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 3: ఇంగ్లిషులో నైపుణ్యానికి, పోటీతత్వం పెంపొందించడానికి ప్రతిభా పరీక్షలు దోహదపడతాయని ఎంఈవో వెంకటేశం అన్నారు. ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ (బాలికల)లో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ ప్రతిభా పరీక్ష, ఉపన్యాస పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ల అసోసియేషన్ ఎల్లారెడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో 8,9వ తరగతుల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష, ఉపన్యాస పోటీలను నిర్వహించినట్లు మండల బాధ్యుడు పర్స వెంకటరమణ తెలిపారు. ఉపాధ్యాయులు రాజులు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. ఒలింపియాడ్ పరీక్షా ప్రశ్నపత్రాన్ని ఎంఈవో ఆవిష్కరించగా.. తెలుగు మాధ్యమంలో అంశర మహావిన్, తరుణి, శివసాయి, అభిరామ్, ఉపన్యాస పోటీల్లో అంశర, ఈశ్వర్, ప్రసన్న ప్రతిభ చూపారు. మోడల్, కస్తూర్బా పాఠశాలల విభాగంలో సంహిత, అక్షర మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. వీరికి ఎంఈవో వెంకటేశం, ఎంఎన్‌వో రాజులు, అడ్విలింగాల్ హెచ్ఎం నర్సింహారావు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సుమన్, కృష్ణారెడ్డి, రవీందర్, సృజన్, రమేశ్, మాధవి, అనిత, వనజ, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె

ఎల్లారెడ్డిలో నినాదాలు చేస్తున్న హమాలీలు

కామారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్, జనవరి 3: ఎల్లారెడ్డిలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయీస్ హమాలీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు కె.సాయిలు మాట్లాడుతూ.. 2024 సంవత్సరంలో సివిల్ సప్లయిస్ కమిషనరేట్ కూలీ రేటును సంచికి రూ.20 నుంచి 29కి పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. ఇప్పటివరకు జీవో విడుదల చేయకపోవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కాశీరాం, కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు నరేశ్, రాములు, ప్రభాకర్, బాబు, అల్లు తదితరులు పాల్గొన్నారు.కామారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సివిల్ సప్లయీస్ హమాలీలు, ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతున్నది. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, ఉపాధ్యక్షుడు దశరథ్, హమాలీ కార్మికులు బీరయ్య, శ్రీనివాస్, సంపత్, గంగరాజు, భీమయ్య, కృష్ణ, బీరయ్య, సాయిలు, శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్, జనవరి 3: పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.20లక్షలతో పంచాయతీ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణంతో గ్రామస్తుల ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మల్లప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

పెద్దకొడప్‌గల్, జనవరి 3: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండలంలో చోటుచేసుకున్నది. పిట్లం ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బుడిమి గ్రామానికి చెందిన మ్యాతరి సాయిలు (57) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దవాఖానల్లో చూపించుకున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మండలంలోని బొల్లక్‌పల్లి శివారులోని మంజీరానదిలో శుక్రవారం దూకి